క్లుప్తంగా

వైవీయూలో క్రీడాపోటీలు



క్రికెట్‌ విజేతగా నిలిచిన గ్రీన్‌ కింగ్‌ లెవెన్‌

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ జట్ల మధ్య క్రీడాపోటీలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు. కాగా క్రికెట్‌ విజేతగా వైవీయూ బోధనేతర సిబ్బంది జట్టు గ్రీన్‌కింగ్స్‌ లెవన్‌ జట్టు విజేతగా నిలిచింది.

బీజేపీకి బుద్ధిచెప్పాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ వ్యవస్థలు లేకుండా చేస్తోందని, ఇలాంటి పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. శనివారం దళిత హక్కుల పోరాట సమితి జిల్లా సమితి సమావేశంలో పాల్గొన్న చంద్ర మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లిలాంటి ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌ శక్తులకు అమ్మివేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఇమ్మానియేల్‌, మునెయ్య, పడిగ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

స్వామి నాథన్‌ కమిటీ సిఫార్సులను అమలు చేయాలి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్‌ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి జకరయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

ఓటు విలువ యువత తెలుసుకోవాలి

కడప కార్పొరేషన్‌ : ఓటు ఎంతో విలువైనదని, ఓటు హక్కుకున్న ప్రాధాన్యతను యువతీ యువకులు తెలుసుకోవాలని భారత్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ కరస్పాండెంట్‌ ఫరూఖ్‌ తెలిపారు. శనివారం స్థానిక భారత్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇంజినీరింగ్‌ సెమినార్‌ హాల్‌లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సహకారంతో గాయత్రి మహిళా మండలి ఆధ్వర్యంలో 'ఓటు హక్కు ప్రాధాన్యత పై అవగాహనా కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్‌ బాషా, గాయత్రి మహిళా మండలి అధ్యక్షురాలు నారాయణమ్మ మాట్లాడుతూ ఓటు హక్కును చాలా పవిత్రంగా చూడాలన్నారు.

4 నుంచి చిరుధాన్యాల ఆహార తయారీలో శిక్షణ

కడప కల్చరల్‌ : కడప నగరానికి చెందిన దాస్‌ ఎడ్యుకేషనల్‌ అండ్‌ వెల్ఫేర్‌ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో సోమవారం నుంచి చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఓబులదాస్‌ తెలిపారు. డ్వాక్రా మహిళలు ఈ శిక్షణ పొందవచ్చని, ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. కృషివిజ్ఞాన కేంద్రం హోం సైంటిస్టు డాక్టర్‌ ప్రశాంతి ఈ తరగతులు నిర్వహిస్తారన్నారు. ఎర్రముక్కపల్లెలోని పీఎఫ్‌ కార్యాలయం ఎదురుగా గల భవనంలో ఎంఈడీపీ ప్రోగామ్‌లో భాగంగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 4 నుంచి 18వ తేది వరకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఆయన వివరించారు.

పుస్తకం ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్‌, అధికారులు

వైవీయూ : వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య ఎస్‌. రఘునాథరెడ్డి రచించిన 'నిర్వహణ సూత్రాలు (ప్రిన్సిపుల్స్‌ ఆఫ్‌ మేనేజ్మెంట్‌)' పుస్తకాన్ని వైస్‌ చాన్సలర్‌ ఆచార్య చింతా సుధాకర్‌ శనివారం ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా పరిపాలనాపరమైన బాధ్యతల్లో విరామం లేకుండా ఉన్నప్పటికీ పుస్తకాలు రాయడం ప్రశంసనీయమన్నారు. ఇప్పటివరకు 13 పుస్తకాలను ఆయన తీసుకురావడం వల్ల బోధన, పరిశోధన పరమైన అనుభవాలు విద్యార్థులకు చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్‌ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ మేనేజ్‌మెంట్‌ విద్యార్థుల అవసరాలకు తగ్గట్టు పుస్తకాన్ని తీసుకురావడం ప్రశంసనీయమన్నారు. కంట్రోలర్‌ ఆఫ్‌ ఎగ్జామినేషన్స్‌ ఆచార్య ఎస్‌ ఈశ్వర్‌ రెడ్డి , సైన్స్‌ విభాగ డీన్‌ ఆచార్య కృష్ణారెడ్డిలు రచయితను అభినందించారు. రచయిత ఆచార్య రఘునాథరెడ్డి స్పందిస్తూ బీఏ, బీకాం, బీబీఎం రెండవ సెమిస్టర్‌ విద్యార్థుల కోసం ఈ పుస్తకాన్ని రాశామన్నారు. వైవీయూ పాలకమండలి సభ్యురాలు ఆచార్య చంద్రమతి శంకర్‌, ఎకనామిక్స్‌ విభాగాధిపతి ఆచార్య అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం



అక్కాయపల్లె పార్కు ముఖద్వారం



అక్కాయపల్లె పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలు



పార్కులో పరుచుకున్న పచ్చదనం

- సర్వాంగ సుందరంగా అక్కాయపల్లె పార్కు
- నేడు ప్రారంభోత్సవం... పాల్గొననున్న ఎంపీ, డిప్యూటీ సీఎం, మేయర్‌

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం అందరికీ స్వాగతం పలుకుతోంది. స్థానిక అక్కాయపల్లెలో నూతనంగా నిర్మించిన పార్కు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. రూ.1.32 కోట్లు ఖర్చు చేసి అతి కొద్ది కాలంలోనే దీన్ని నిర్మించారు. ఇందులో జిమ్‌ చేయడానికి ప్రత్యేక పరికరాలు, ఫజిల్‌ గేమ్‌, ఆక్యుపంచర్‌ పాత్‌వే, వాకింగ్‌ చేయడానికి నడక దారులు, ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు పచ్చని గడ్డి పరిచి, విరివిగా మొక్కలు నాటారు. రాత్రిపూట వెలుతురు కోసం హైమాస్‌ లైట్లు, రంగు రంగుల దీపాలు అలంకరించారు. పార్కు చుట్టూ సరికొత్తగా ఇనుప ఫ్రేమ్‌తో ప్రహరీ ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ పార్కును కడప ఎంపీ వైఎస్‌ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌ సురేష్‌ బాబు ప్రారంభించనున్నారు. దీనితోపాటు మరియాపురం చర్చి వద్ద రూ.45 లక్షలతో నిర్మించిన అక్కాయపల్లె ప్లాజాను కూడా వారు ప్రారంభించనున్నారు.

టీడీపీ కార్యాలయానికి కేటాయించిన గత ప్రభుత్వం..

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం పార్కు నిర్మించిన ఈ స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి కేటాయిస్తూ జీవో జారీ చేశారు. అదే జరిగి ఉంటే ఇప్పుడు ఈ అందమైన, ఆహ్లాదకమైన పార్కు ఏర్పడి ఉండేదే కాదు. అప్పట్లో 47వ డివిజన్‌ కార్పొరేటర్‌ పాకా సురేష్‌ కుమార్‌ తీవ్రంగా వ్యతిరేకించి, పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకుపోవడంతో పాటు, న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్థలాన్ని టీడీపీ కార్యాలయానికి కేటాయించకుండా ఆపగలిగారు.

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్రలో వీహెచ్‌పీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : విశ్వహిందూ పరిషత్‌ ఆధ్వర్యంలో శనివారం రామసేవకులు శివాలయం నుంచి టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం వరకు వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్‌ నాయకులు మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట జరిగి మండల దీక్ష (40 రోజులు) అయిన సందర్భంగా ఈ శోభాయాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు చీతిరాల నాగార్జునరావు, మారెళ్ల మల్లికార్జునరావు, నగర కార్యదర్శి నాగమునిరెడ్డి, చలపతి, మార్కండేయ, మురళి, లక్ష్మీనారాయణ, రామసేవకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



భద్రావతి భావనారాయణ స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్‌ : కడప నగరం సాయిపేటలోని శ్రీ భద్రావతి భావ నారాయణస్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. నగర వాసులే కాకుండా సమీప ప్రాంతాల నుంచి కూడా భక్తులు విశేష సంఖ్యలో కుటుంబాలతో సహా తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు శేష శైలేంద్రశర్మ బృందం ఆలయ కమిటీ సభ్యుల సహకారంతో ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి కనుల పండువగా వధూవరులుగా అలంకరించి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా వేద పండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులందరికీ అన్నదానం చేశారు.

ఘనంగా అశ్వర్థ నారాయణస్వామి కల్యాణం

కడప నగరం తహసీల్దార్‌ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీ నాగుల క్షేత్రంలో శనివారం శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం విశేష పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో సర్పశాంతి హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

తాగునీటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అవసరమైన చోట ట్యాంకర్లతో నీటి సరఫరా
- పాత బోర్లకు మరమ్మతులు చేసి, అవసరమైతే కొత్త బోర్లు వేయాలి
- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, మేయర్‌ కె. సురేష్‌బాబు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్‌ : వేసవి కాలంలో తాగునీటి సమస్యల పట్ల నగరపాలక అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్‌ కె. సురేష్‌ బాబు ఆదేశించారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ వీసీ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం కాకమునుపే కడపకు ప్రధాన నీటి వనరు అయిన పెన్నానది ఎండిపోయిందని, మైలవరం నుంచి పెన్నాకు నీటిని విడుదల చేయించడం జరిగిందన్నారు. వేసవిలోనే ముస్లింలకు పవిత్రమైన రంజాన్‌ పండుగ, సార్వత్రిక ఎన్నికలు రానున్నాయన్నారు. ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉంటారని ఎక్కడా ఎలాంటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. నగరంలోని అన్ని నీటి వనరులను ఆధీనంలోకి తీసుకోవాలని, బోర్లు ఎక్కడైనా పాడై ఉంటే మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్త బోర్లు కూడా వేయాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, ఇందుకు ట్యాంకర్లను కూడా అద్దెకు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించాలన్నారు. ఎక్కడా నీటి వృథా జరక్కుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు కూడా తాగునీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఈ మేరకు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. నీటికి సంబంధించి ఎక్కడ సమస్య వచ్చినా యుద్ధ ప్రాతిపదికన స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్‌ జీఎస్‌ఎస్‌ ప్రవీణ్‌చంద్‌, ఎస్‌ఈ రత్నాల రాజు, ఎంఈ లు నారాయణస్వామి, ధనలక్ష్మి, డిప్యూటీ మేయర్‌ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు చెన్నయ్య, మల్లికార్జున, సానపురెడ్డి శివకోటిరెడ్డి, కె. బాబు, రామక్రిష్ణారెడ్డి, కె. సూర్యనారాయణ, షఫీ, అజ్మతుల్లా, జఫ్రుల్లా, షంషీర్‌, పాకా సురేష్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, బండి ప్రసాద్‌, రఫీ, కె. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా ట్రాఫిక్‌ సిగ్నలింగ్‌ వ్యవస్థ

- నగర మేయర్‌ కె. సురేష్‌ బాబు
- స్టాండింగ్‌ కమిటీలో పలు అంశాలకు ఆమోదం



స్టాండింగ్‌ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్‌ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్‌ : కడప నగరంలో ట్రాఫిక్‌ సిగ్నలింగ్‌ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్‌ కె.సురేష్‌బాబు అన్నారు. శనివారం సాయంత్రం కార్పొరేషన్‌ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో నిర్వహించిన స్టాండింగ్‌ కమిటీ సమావేశంలో పలు అంశాలకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌ సిగ్నలింగ్‌ పరికరాల సరఫరా, ఇన్‌స్టాలేషన్‌, డిస్‌ప్లే, లయబిలిటీ రెండేళ్ల కాలపరిమితితో ఎస్‌పీటీ నెట్‌వర్క్‌ హైదరాబాద్‌ వారికి ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన కూరగాయల మార్కెట్లు, జంతు వధశాలలు, మాంసపు అంగళ్లు గుత్త కాలపరిమితి ముగిసినందున బహిరంగ వేలం వేయుటకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్‌ శ్రీనివాసరావు, స్టాండింగ్‌ కమిటీ సభ్యులు మల్లీశ్వరి, సుజాత, గౌస్‌ జబీన్‌, కె. అరుణ ప్రభ, ఎస్‌ఈ రత్నాల రాజు, ఈఈలు నారాయణ స్వామి, ధనలక్ష్మి, డీసీపీ సూరజ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కడప కార్పొరేషన్‌ : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జనరంజక పాలన సాగుతోందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌ బి అంజద్‌బాష, నగర మేయర్‌ కే సురేష్‌ బాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక 6వ డివిజన్‌లో విద్యుత్‌ నగర్‌ వద్ద గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.35 లక్షలతో నిర్మించిన కేసీ కెనాల్‌ కల్వర్టు, రోడ్డును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 6వ డివిజన్‌ కార్పొరేటర్‌ నాగేంద్రప్రసాద్‌, పార్టీ నాయకులు సీహెచ్‌ వినోద్‌, బంగారు నాగయ్య, ఎస్‌. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, ఆర్‌ వి రమణ, బండి ప్రసాద్‌, మల్లికార్జున, రామ లక్ష్మణ్‌ రెడ్డి, సుబ్బరాయుడు, రామచంద్ర, షఫీ, యల్లారెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వైవీయూ : పెన్షనర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు చెన్నారెడ్డి కోరారు. శనివారం కడప నగరంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఈసీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం రెండు నెలలుగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా నిరసన తెలిపామన్నారు. ప్రభుత్వం స్పందించి కొన్ని సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో పాటు మరికొన్ని సమస్యలపై మంత్రివర్గం ఉపసంఘం, సీఎస్‌ ఆధ్వర్యంలో చర్చలు జరిపి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో తదుపరి నిరసన కార్యక్రమాలు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వి. నాగమునిరెడ్డి, నాయకులు బాలసుబ్రమణ్యం, శంకరయ్య, నాగేష్‌, మల్లయ్య, సుభాన్‌, దేవరాజు, అపూర్వసుందరి, విశ్వనాథ్‌సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి చిరుద్యోగుల పాలాభిషేకం



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శిల్పారామం చిరుద్యోగులు

కడప కల్చరల్‌ : శిల్పారామంలో చిరుద్యోగులుగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, హౌస్‌ కీపింగ్‌ వర్కర్లు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తమ జీతాల విషయంగా సమస్యను ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆ మేరకు వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. మార్చి 1వ తేదీన ఆయా ఉద్యోగులకు పెంచిన మేరకు వేతనాలు అందాయి. వా శనివారం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రోడ్డు పనులకు భూమిపూజ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కాంపల్లి పంచాయతీ పరిధిలోని వెంకట్రాంపల్లి గ్రామంలో శనివారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని కాంపల్లి, వెంకట్రాంపల్లి, ఇప్పపెంట, అగ్రహారం తదితర గ్రామాల మీదుగా ఎస్టీపీసీ వద్దకు చేరుకునే రోడ్డును రూ.2 కోట్ల 97 లక్షలు పీఎంజీఎస్‌వై నిధులతో నిర్మిస్తున్నామన్నారు. ఇందులో తారు రోడ్డుతో పాటు సీసీరోడ్లు కూడా వేస్తామన్నారు. ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్‌ గుడా ప్రభాకర్‌ రెడ్డి, కో కన్వీనర్‌ కళాయాదవ్‌, మాజీ మండల కన్వీనర్‌ గుత్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ కష్టయ్య, మైనార్టీ బోర్డ్‌ డైరెక్టర్‌ ఇదాయతుల్లా, సర్పంచులు కొత్తపల్లి రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున యాదవ్‌, ఎంపీటీసీలు నారే నాగరాజు, గురజాల ప్రసాద్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

బాలికా విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

వైవీయూ : బాల్యవివాహాలను అరికట్టడంతో పాటు బాలికావిద్యను ప్రోత్సహించాలని యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్‌-7 ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ కె. లలిత పేర్కొన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయం సమీప గ్రామమైన వేలూరుపాడులో ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమాలు, బాలికల సమస్యలపైన అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళలకు ఏవైనా సమస్యలు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్ప్‌లైన్‌ నెంబర్ల గురించి అవగాహన కల్పించారు. అనంతరం ఎంబీఏ అధ్యాపకురాలు డా. పి. సరిత బాలికల సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. అశ్వర్థరెడ్డి, బయోటెక్నాలజీ, సైకాలజీ విద్యార్థులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర పోస్టర్ల ఆవిష్కరణ

చింతకొమ్మదిన్నె : మండలంలోని గంగమ్మతల్లి జాతర పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆలయ చైర్మన్‌ పి.బి విశ్వనాథరెడ్డి, ఆలయ ఈవో సురేష్‌ కుమార్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పొలతల శైవ క్షేత్రంలో ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన గోడ పత్రాలను శనివారం కడప నగరంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు.

రేపు టెంకాయల వేలం పాట

సింహాద్రిపురం : మండలంలోని అంకాలమ్మగూడూరు దేవస్థానంలో సోమవారం టెంకాయల వేలంపాట నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌ అశోక్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకాలమ్మ ఆలయానికి సంబంధించి టెంకాయల వేలంపాటలో పాల్గొనే వారు రూ.50 వేలు డిపాజిట్‌ చేసి పాల్గొనాలన్నారు. వేలంపాట దక్కించుకున్న వారికి ఏడాది వరకు సమయం ఉంటుందన్నారు. వివరాలకు 8247579716, 8919189323, 9030242944 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిదెన ఓబాయపల్లె గ్రామంలో ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ ప్రతిష్టకు హాజరైన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డితో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయానికి ఎమ్మెల్యే రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, అలిదెన మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ క్రాప్‌ జాబితాలు

వల్లూరు : 2023-24 రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్‌ నమోదు ముసాయిదా జాబితాలు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో వున్నాయని, రైతులు తమ పేర్లు, పంట, విస్తీర్ణం వివరాలను పరిశీలించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సాయ జ్యోతి తెలిపారు. మండలంలోని తొల్లగంగనపల్లె ఆర్‌బీకేలో శనివారం రైతులతో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. మండలం మొత్తం మీద 12,002 ఎకరాల్లో శనగ, మినుము, నువ్వులు, వరి పంటలకు ఈ క్రాప్‌ నమోదయిందన్నారు. 3వ తేదీ వరకు ఈ క్రాప్‌ నమోదు ముసాయిదా జాబితాలు ఆర్‌బీకేల్లో అందుబాటులో వుంటాయన్నారు. రైతులు వివరాలను పరిశీలించి ఏవైనా పొరపాట్లు వుంటే విలేజ్‌ అగ్రికల్చర్‌ అసిస్టెంట్‌కు గానీ, విలేజ్‌ హార్టికల్చర్‌ అసిస్టెంట్‌లకు రాత పూర్వకంగా తెలిపాలన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

ఉప ముఖ్యమంత్రి ఎస్‌. బి అంజద్‌ బాష



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్‌ సురేష్‌ బాబు

కడప కార్పొరేషన్‌ : రాష్ట్రంలోని ప్రతిపేదవాడి సొంతింటి కలను నిజం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌ బాష అన్నారు. శనివారం కడప నగరంలోని మద్రాసు రోడ్డులోని వైఎస్సార్‌ ఆడిటోరియంలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో మేయర్‌ సురేష్‌ బాబుతో కలిసి 11,433 మంది లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్‌ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత పెద్ద ఎత్తున ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం చారిత్రాత్మకమన్నారు. మహాత్మా గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేస్తూ గ్రామాల, జిల్లాల అభివృద్ధిని సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్‌ జగన్‌ నూటికి నూరు శాతం నెరవేరుస్తున్నారన్నారు. గతంలో పేదలకు ఇచ్చే ఇంటి స్థలాల విషయంలో ఎన్నో మోసాలు, అవకతవకలు జరిగేవని, జగనన్న ప్రభుత్వంలో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా చేపట్టామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా ఇంటి స్థలాలను కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలకుపైగా ఇళ్లను నిర్మించి దేశంలో గృహ నిర్మాణ రంగంలో కొత్త చరిత్రను సృష్టించామన్నారు. పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలన్న సంకల్పంతో ప్రభుత్వ భూములు లేని చోట్ల ప్రవేటు భూమిని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కడపలో నూట పది ఎకరాల్లో నానాపల్లెలో కోట్లు విలువజేసే ప్రవేటు భూమిని కొనుగోలు చేసి సుందరమైన లేఅవుట్‌ ఏర్పాటు చేసి, ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఇంకా ఎవరికైనా ఇంటి పట్టాలు రాకుంటే సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే పట్టాలు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, జయచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కె. సూర్యనారాయణ రావు, రామలక్ష్మణ్‌రెడ్డి, మల్లికార్జున, షఫీ, పాకా సురేష్‌, కో ఆప్షన్‌సభ్యులు బి. మరియలు, పత్తిరాజేశ్వరి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కడప కార్పొరేషన్‌ : పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా స్థానిక 36వ డివిజన్‌లోని బళ్లారి రోడ్డు, ఆగాడి ప్రాంతాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఇంటింటికీ కలిగిన లబ్ధిని వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే వారందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా జి. రమణమ్మ అనే మహిళ మాట్లాడుతూ వైఎస్సార్‌ పింఛన్‌ కానుక, జగనన్న అమ్మ ఒడి ద్వారా రూ.1.08లక్షల లబ్ధి చేకూరిందని సంతోషం వ్యక్తం చేసింది. వనిపెంట రెడ్డెమ్మ అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్‌ పింఛన్‌ కానుక, జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్‌ చేయూత పథకాల ద్వారా రూ.85 వేలు మేలు జరిగిందని ఆనందం వ్యక్తం చేసింది. పి. లక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు వివిధ పథకాల ద్వారా రూ.54 వేలు లబ్ధి చేకూరిందని, మరే ప్రభుత్వంలో ఇంత మేలు జరగలేదని చెప్పింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 36వ డివిజన్‌ ఇన్‌చార్జి రఫీ, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్‌, ఎన్‌. సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ, మియ్యా, రత్న కుమారి, ఉమామహేశ్వరి, పాల్గొన్నారు.

రాయలసీమలో వైఎస్సార్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ బెస్ట్‌



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ప్రొఫెసర్‌ చింతా సుధాకర్‌

ప్రొద్దుటూరు : రాలయసీమ ఇంజినీరింగ్‌ కాలేజీల్లో వైఎస్సార్‌ ఇంజినీరింగ్‌ కాలేజీ బెస్ట్‌ అని యోగివేమన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్‌, ప్రొఫెసర్‌ డాక్టర్‌ చింతా సుధాకర్‌ తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్‌ ఇంజినీరింగ్‌ కాలేజీలో ఎలక్ట్రానిక్స్‌ అండ్‌ కమ్యూనికేషన్‌ ఇంజినీరింగ్‌ విభాగంలో 'సూపర్‌కంప్యూటర్‌ ఇన్‌ హ్యాండ్‌: కరెంట్‌ అండ్‌ ఫ్యూచర్‌ ట్రెండ్స్‌ ఇన్‌ మొబైల్‌ ఎస్‌ఎంసీ' అనే అంశంపై వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తగిన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ సి.నాగరాజు మాట్లాడుతూ కళాశాలలోని ప్రతిభాగంలో వర్క్‌షాప్‌, ట్రెనింగ్‌ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతాయన్నారు. హెడ్‌ ఆఫ్‌ ది డిపార్ట్‌మెంట్‌ డాక్టర్‌ బీపీ సంతోష్‌ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్‌లో ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహిస్తామన్నారు. వెనుకబడిన విద్యార్థులకు కోచింగ్‌ ఇస్తామన్నారు. కోఆర్డినేటర్‌ డాక్టర్‌ ఎస్‌.షఫివుల్లా బాషా మాట్లాడుతూ పెద్దపెద్ద కంపెనీల్లో పని చేస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులతో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎన్‌వీఐడీఐఏ సంస్థలో సీనియర్‌ ఎస్‌ఓసీ ఆర్కిటెక్‌గా పని చేస్తున్న కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్‌ బి.కరుణాకర్‌ రెడ్డి సూపర్‌ కంప్యూటర్‌ పవర్‌ను సెల్‌ఫోన్‌ టెక్నాలజీకి అనుసంధానం చేస్తూ విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీఎస్‌ ప్రొఫెసర్‌ కేవీ రమణయ్య, సివిల్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ బి.జయరామిరెడ్డి, మెకానికల్‌ విభాగాధిపతి ప్రొఫెసర్‌ సి.జయచంద్రరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రీజనల్‌ మేనేజర్‌ పురుషోత్తంరెడ్డి తెలిపారు. శనివారం నూతన భవన నిర్మాణం పనులకు ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. కడప జిల్లాలో మొట్ట మొదటి గ్రామీణ బ్యాంకు శాఖ వీరపునాయునిపల్లె శాఖ అని అప్పటి నుంచి ఇప్పటి వరకు బ్యాంకు అభివృద్ధికి మండల ప్రజలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేమన్నారు.